# ఈ దాహం తీరనిది



***ఉద్ధర్షః పిబతిజలం***

***యథాయథా విరలాంగులిః పథికః***

***ప్రపాపాలికాపి***

***తథా తథా ధారాం తనుమపి తన కరోతి***

***భావం:*** బాటసారి వ్రేళ్ల సందులు పెద్దవి చేసి, దోసిలితో తాగుతుండగా చలివేంద్రపు అమ్మాయి సన్నటి నీటి ధారను మరింత సన్నం చేసి నీళ్లు పోస్తున్నది.

ఒక పల్లెటూళ్లో ఒక ఇంట్లో భార్యాభర్తలు కూర్చుని మాట్లాడు కుంటున్నారు. వారి సంభాషణ వారి ఏకైక  కుమారుడి వివాహం గురించి నడుస్తున్నది.

'అబ్బాయికి ఏ అమ్మాయీ నచ్చడం లేదు. ఏం చెయ్యాలో తెలియడం లేదు' అంది భార్య. 'అదే అర్థం కావడంలేదు. మొన్న కామవరం వెళ్ళి పిల్లని చూసి వచ్చాం కదా. అమ్మాయి అందంగా ఉంది. చక్కగా పాట పాడింది కూడానూ' అని భర్త అన్నాడు.

ఏమో ఎందుకు నచ్చలేదో. అంతకు ముందు సూరవరంలో పిల్లా బాగుంది. కవిత్వమూ, గణితమూ కూడా నేర్చుకుందట' అంది పిల్లాడి తల్లి.

'వీడి మనస్సు లో ఏ ఊహా సుందరి ఉందో ఏమో' అన్నాడు తండ్రి.

'మా పెదనాన్నగారి మనవడి పెళ్లికి పిల్చారు కదా. వెడదాం. పెళ్లికి వచ్చిన పిల్లల్లో ఎవరైనా నచ్చుతారేమో'  అని భార్య భర్తతో అంది.

భార్యభర్తలు కొడుకుతోసహా పొరుగూళ్లో పెళ్లికి బయల్దేరారు. అది వైశాఖ మాసం. ఎండలు మండిపోతున్నాయి. ఇప్పటిలా సామాన్య గృహస్థులకు ప్రయాణానికి వాహన సౌకర్యం లేదు. కాలినడకన ప్రయాణం. నెమ్మదిగా నడుస్తూ మధ్యాహ్న సమయానికి మహారాజు ఏర్పాటు చేసిన చలివేంద్రానికి చేరుకున్నారు. చలివేంద్రమంటే కేవలం రెండు మంచి నీళ్ళ కుండలూ, ఒక గాస్లూ మాత్రమే కాదు. మహారాజులూ, ధనవంతులైన ధర్మాత్ములూ, బాటసారుల కోసం నీళ్ళతో పాటు రాగిజావా, జొన్నకలీ, బియ్యం గంజీ, మజ్జిగా, ఫలరసాలూ కూడా తమ శక్తికి తగినట్లుగా ఏర్పాటు చేసేవారు. ఒక చిన్న కుటుంబం చలివేంద్రం నిర్వహించేలా చూసేవారు.

భార్యా, భర్తా, కొడుకూ, ఇంకా మిగిలిన బాటసారులకు చలివేంద్రంలో ఒకమ్మాయి రాగిజావా, మజ్జిగా, ఒక అరటి పండూ ఇచ్చింది.

అందరూ కడుపునింపుకున్నాక అందరికీ నీళ్లు పొయ్యసాగింది. ఆ అమ్మాయి కుండ వొంచి నీళ్లు పోస్తుంటే తాగాలి. బాటసారులందరూ తాగి వెళ్ళిపోయారు. భార్యా, భర్తా కూడా నీళ్లు తాగి గమ్యం వైపు నడవసాగారు. కొడుకు మిగిలాడు. ఆ అమ్మాయి అందం అతన్ని కదలనివ్వలేదు. ఆ అమ్మాయి నీళ్లు పోస్తూంటే, అతను వేళ్ల సందుల్ని వెడల్పు చేసి తాగడం మొదలెట్టాడు. నీళ్లు చాలా మటుకు కిందకు పోతున్నాయి. అతనికి దాహం తీరడం లేదు. చలివేంద్రపు అమ్మాయి సౌందర్య దర్శన దాహం అసలు తీరడం లేదు.

చలివేంద్రపు అమ్మాయి కూడా అతన్ని చూసింది. అతని అందానికీ, అతనికి తనపై కలిగిన ఆరాధనా భావానికి లొంగిపోయింది. అసలే సన్నగా ప్రవహిస్తున్న నీటి ధారను మరింత సన్నం చేసి నీరు పోయసాగింది. కొంచెం దూరం వెళ్ళిన భార్యా భర్తా వెనక్కు తిరిగి చూశారు. చలివేంద్రంలో సన్నగా ప్రవహిస్తున్న ప్రేమధార వారి హృదయాలను చల్లబరచింది. కులగోత్రాలతో, ధనంతో, హోదాతో సంబంధం పెట్టుకోకుండా కొడుకునీ, కాబోయే కోడల్నీ దీవించారు.

******